ప్రజాశక్తి
మంగళవారం 31 జనవరి 2023
అనంతపురం

రైతులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

రైతులకు భరోసా కల్పించాలి

◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ◆ సోలార్ గ్రామాల్లో పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సోలార్ పార్కుకు కోసం భూములు సేకరించే విషయంలో రైతుల్లో అనేక సందేహాలు, అనుమానాలున్నాయని వాటిని ప్రభుత్వం, అధికారులు నివృత్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. డీ.హీరేహాళ్ మండలంలోని సోమలాపురం, మురిడి గ్రామాల్లో రాంభూపాల్‌లతోపాటు సిపిఎం నాయకులు సోమవారం పర్యటించారు. సోలార్ పార్కు కింద భూములు పోతున్న రైతులతో మాట్లాడారు. కంపెనీకి భూమిలిస్తే లీజు సక్రమంగా ఇవ్వకపోతే తమ పరిస్థితి ఏమిటన్న సందేహాలను రైతులు వ్యక్తం చేశారు. ఇతర పరిశ్రమల పేరుతో వందల ఎకరాల సేకరించిన వారితో మొదట భూములివ్వడానికి అంగీకారం తెలిపినట్టు చెప్పి తక్కిన రైతుల భూములు పరిశ్రమకు తీసుకునేందుకు చూస్తున్నారని రైతులు సిపిఎం నాయకుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఆదానీ కంపెనీ కోసం రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో మొదటి విడత కింద 11 వేల ఎకరాల భూమిని సేకరించేందుకు రంగం సిద్ధమైనట్టు తెలుస్తోందన్నారు. ఎకరానికి ఏడాదికి రూ.30 వేలు లీజు ఇస్తామని చెబుతున్నప్పటికీ, స్పష్టమైన హామీ ఏదీ రైతులకు లేకపోవడమే ఆందోళన కలిగిస్తోందన్నారు. ఒకసారి రైతులతో మాట్లాడిన అధికారులు ఇప్పటి వరకు ఏ విషయాలు చెప్పలేదని రైతలతో మాట్లాడినప్పుడు తెలుస్తోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులకు ఒక స్పష్టతనివ్వాలని తెలిపారు. లీజు కంపెనీ చెల్లించని పక్షంలో రైతులకు ప్రభుత్వం తరుపు హామీ ఉండాలని డిమాండ్ చేశారు.

వీధికొక రథసారథి..!

◆ ఎన్నికలకు వైసిపి పక్కా ప్రణాళిక ◆ వాలంటీర్లకు తోడుగా గృహరథసారధులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికార వైసిపి అప్పుడే ఎన్నికలకు సర్వం సిద్ధమవుతోంది. గతేడాది నుంచే గడపగడపకూ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. అది ఇంక కొనసాగుతూ ఉంది. అయితే ఈ కార్యక్రమం అంతగా ఫలితాలిస్తున్నట్టు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మరింత లోతుగా ప్రజలకు చేరవయ్యేందుకు సన్నద్ధమైంది. పట్టణాల్లో వంద కుటుంబాలకు ఒక వాలంటీరు, గ్రామాల్లో 50 ఇళ్లకు ఒకరు చొప్పున ఉన్నారు. వీరి ద్వారా సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. అయితే ఎన్నికల్లో వాలంటీర్లను పక్కనబెడితే ఏమవుతుందో గుబులో ఏమోగాని వారి కింద మరికొంత మందిని నియమించే ప్రక్రియను అధికార వైసిపి చేపడుతోంది. అది వాలంటీర్ల ద్వారానే చేపడుతోంది. ప్రతి వీధికి ఒక గృహ రథసారధి పేరుతో నియామకాలను చేపడుతున్నారు. ఇప్పటికే వార్డుకు ఒక కన్వీనర్‌ను నియమించారు. ఇది కాకుండా తాజాగా వీధికొక గృహ రథసారధిని నియమిస్తున్నారు. వాలంటీర్లకు ఎన్నికల సంఘం వీధుల్లోకి తీసుకోకుండా ఇతర వాటికి వినియోగిస్తే గృహ రథసారధుల ద్వారా ప్రజలకు చేరవయ్యేందుకు ప్రణాళిక రచిస్తోంది. ఈ రథసారధులు ఎన్నికల వరకు ప్రతి ఇంటికెళ్లి ఆయా కుటుంబానికి జరిగిన మేలు గురించి వివరించాల్సి ఉంటుంది. వారి ద్వారానే ఎన్నికల్లోనూ ఓటర్లను ప్రభావితం చేసే ఆలోచనలోనున్నట్టు తెలుస్తోంది. ఈ రకంగా ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో వేలాది మంది గృహ రథసారదులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతోంది. రథసారధులను వాలంటీర్ల ద్వారానే గుర్తించి వారి ఆధార్‌కార్డులు, పాస్‌పోర్టు సైజ్ ఫోజులు సైతం సేకరిస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేసి ఎన్నికలకు సన్నద్ధమయ్యే పనులను చేపడుతోంది.

ఎన్నికల కోసమేనా ?

ఈ రకంగా పెద్దఎత్తున చేపడుతున్న నియామకాలు వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకునేనా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే వార్డు కన్వీనర్లు, వాలంటీర్లు కాక, మరింత మందిని గృహ రథసారధులు చేపడుతుండటం ఎన్నికల్లో సులభంగా ప్రతి ఓటరును ప్రభావితం చేయడానికేనా అన్నది చర్చ సాగుతోంది. ఇది పూర్తయితే ఎన్నికలకు ఇంత పెద్ద యంత్రాంగం మరే ఇతర పార్టీ వద్ద ఉండే అవకాశం లేదు. సూక్ష్మస్థాయి ప్రతి ఓటరు మొదలుకుని ప్రభావితం చేసేందుకు వీలుగా అధికారపార్టీ కసరత్తు ప్రారంభించిందనే చెప్పాలి. సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల మనుషుల్లో స్థానముందని చెప్పుకునే వైసిపి ఈ రకమైన ప్రణాళికతో ముందుకుపోవడం ఏమిటన్నది కూడా రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఉద్యోగుల్లో కాస్త వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఉద్యోగులు కాకుండా ఇతర సామాజిక తరగతులు, ఇతర వర్గాలకు తమ వైపు బలంగా తీప్పుకోవడంతోపాటు, తమక అనుకూలమైన వారితో ఓటింగ్ చేయించుకునేందుకు వీలుగా అధికార వైసిపి ఈ రకమైన ఎత్తులు వేస్తున్నట్టు విపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. ఇవన్నీ ఏ రకమైన ఫలితాలను అధికారపార్టీకి తెచ్చిపెడతాయన్నది చూడాల్సి ఉంది.



జగనన్న చేదోడు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

14,882 మందికి జగనన్నచేదోడు

◆ రూ.14.88 కోట్ల లబ్ధి ◆ లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జగనన్న చేదోడు పథకం మూడో విడత కార్యక్రమం ద్వారా జిల్లాలో 14,882 మందికి రూ.14.88 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు మండలి విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాలులో జగనన్న చేదోడు మూడో విడత పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో పాటు బిసి సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు రూ.14.88 కోట్ల మెగా చెక్కు, మరియు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అభినందన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులవత్తిదారులు ప్రభుత్వం ప్రతి ఏటా చేదోడు ద్వారా రూ.10వేలు అందిస్తోందన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది 14,882 మందికి లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ బీసీలు ఆర్థికంగా అభివద్ధి చెందేందుకు నగదు బదిలీ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీసీసీ ఛైర్‌పర్సన్ లిఖిత, ఉర్దూ అకాడెమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్, నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ రిజ్వాన్, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహితీ, కోగటం విజయ భాస్కర్ రెడ్డి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు, బీసీ కార్పొరేషన్ ఈడీ నాగముణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మేలు చేసేలా 'స్పందన'

వివిధ సమస్యలపై ప్రజలు స్పందనలో అందించే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపి ఈ కార్యక్రమం వారికి మేలు చేసేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నాడు స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, డిఆర్ఒ గాయత్రి దేవి, ఆస్సెట్ సిఇఒ కేశవ నాయుడు, ఆర్డీవో మధుసూదన్, జెడ్పీ సిఇఒ భాస్కర్ రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను నిర్దేశిత గడువులోపే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ డివిజన్, మండల అధికారులు అర్జీలను ఎప్పటికప్పుడు ఓపెన్ చేసి పరిష్కరించాలన్నారు. ముఖఆధారిత హాజరునకు సంబంధించి యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకుని రిజిస్టర్ కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్క నాటి నీరు పోస్తున్న ఎపిఎస్ ఆర్టీసీ రాష్ట్ర ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి

ఆర్టీసీని లాభాల్లోకి తీసుకురావడమే ధ్యేయం

ఎపిఎస్ ఆర్టీసీ రాష్ట్ర ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి

ఉరవకొండ : ఎపిఎస్ ఆర్టీసీని లాభాల బాటలో నడిపించడమే ధ్యేయమని సంస్థ రాష్ట్ర ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా డిపో స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థను లాభాల్లోకి తీసుకురావడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యంగా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే కాకుండా ప్రమాదాలు జరగకుండా కండీషన్ ఉన్న బస్సులను నడుపుతున్నామన్నారు. అనంతరం డిపో ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డిపో మేనేజర్ బాలాజీ దయాల్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పెన్నోబులేసు, ఎంబీసీ రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేశులు, విడపనకల్ జడ్పిటిసి హనుమంతు, ఉప సర్పంచి వన్నప్ప, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరంగయ్య - గుత్తిలో భూపోరాటం

ప్రజాశక్తి-గుత్తి

నిరుపేదలకు స్థలాలు ఇవ్వడంతోపాటు పక్కాగృహాలు నిర్మించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాల రంగయ్య అన్నారు. సోమవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పేదల ఇళ్ల స్థలాల కోసం భూ పోరాటం చేశారు. ఇందులో భాగంగా పట్టణంలో నుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, పేదలు ర్యాలీగా వెళ్లి సర్వేనెంబర్ 570లో సిపిఎం జెండాలు పాతి స్థలాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బాల రంగయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరుతో ప్రభుత్వం పేదలకు అన్యాయం చేస్తోందన్నారు. సెంటు లోపు స్థలాన్ని కేటాయించి ఇంటి నిర్మాణానికి కేవలం రూ.1.80 లక్షలు నిధులు కేటాయించి ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇస్తున్న సొమ్ము ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. అధికార పార్టీ నాయకులు ప్రభుత్వానికి సంబంధించిన ఎకరాలకు ఎకరాలు భూములను ఆక్రమించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అదే పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని అడిగితే అధికారులు నిమ్మకు నేరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదలకు ఇంటి పట్టాలిచ్చి పక్కాగృహాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో త్వరలోకలెక్టర్ కార్యాలయం వద్ద 36 గంటలు దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, మండల కార్యదర్శి బి.రామకృష్ణ, నాయకులు యు.మల్లికార్జున, ఎం.మల్లేష్, ఎస్.మున్ని, ఆర్ఎం. కవిత, రంజిత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమించిన భూముల్లో జెండాను పాతుతున్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరంగయ్య, కార్యకర్తలు

సకాలంలో పరిష్కారం చూపండి : ఎస్పీ

సకాలంలో పరిష్కారం చూపండి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

పోలీసు స్పందన కార్యక్రమంలో విన్నవించే ప్రజా సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపి న్యాయం చేయాలని ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో 87 మంది నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్ట పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. జిల్లా నలమూలల నుంచి విచ్చేసిన పిటీషనర్లు, వారి సహాయకులకు దేవా ట్రస్టు సహకారంతో ఉచితంగా భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్పీ

అనంత వైద్య కళాశాల పనితీరు భేష్..

సంతృప్తి వ్యక్తం చేసిన ఎన్ఎంసి బృందం - పెద్దాసుపత్రి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని వైద్య కళాశాల సిబ్బంది పనితీరు, వైద్య విద్య నాణ్యత పనితీరు భేషుగ్గా ఉందని జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసి) వైద్యుల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. సోమవారం స్థానిక వైద్యకళాశాలలో వైద్యవిద్య సీట్ల పెంపునకు జాతీయ వైద్య మండలి వైద్యుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఇందులో భాగంగా ఎంబిబిఎస్ సీట్లు, ఆర్థోపెడిక్, ఫోరెన్సిక్ మెడిసిన్, జనరల్ మెడిసిన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థుల సీట్ల రికగ్నిషన్, మైక్రో బయాలజీకి అదనంగా 7 పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్ల పెంపు తదితర విషయాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎంసి వైద్యుల బృందం మాట్లాడుతూ అనంత వైద్య కళాశాలలో వైద్యులు అన్ని విభాగాల్లో సరిపడా సిబ్బంది ఉన్నారన్నారు. అంతేగాకుండా వైద్య విద్యలో నాణ్యతా ప్రమాణాలు బాగా పాటిస్తున్నారన్నారు. అలాగే రోగుల సంఖ్య, అందుతున్న వైద్య సేవలపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య పరికరాలు కూడా ఉన్నాయన్నారు. మరిన్ని వైద్య పరికరాలు ప్రభుత్వ సహకారంతో సమకూర్చుకుంటే మరింతమంది రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు వీలు ఉంటుందన్నారు. సాయంత్రం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజతో సమావేశమై మెడికల్ కళాశాలలో వసతుల పట్ల అభినందించారు. బృందంలో బెంగళూరు మెడికల్ కళాశాల రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన నలుగురు ప్రొఫెసర్లలో రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ టి.అరుల్ దాసన్, బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ విభ, ఫోరెన్సిక్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ కెవి సతీష్, మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జె.మరి రాజ్, మద్రాస్ మెడికల్ కళాశాల నుంచి కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రియ సెంథిల్‌కుమార్, న్యూఢిల్లీలోని లేడీ హార్డిన్ గే మెడికల్ కళాశాల నుంచి ఇద్దరు ప్రొఫెసర్లు జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ లేఖ రాజ్ గటేకర్, ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ అరవింద్ కుమార్, కేరళ లోని ఎర్నాకులం ప్రభుత్వ వైద్య కళాశాల ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ సిజో జోసెఫ్ పకలోమొత్తమ్ ఉన్నారు. వీరితో ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్లు డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి, డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ కెవిల్ సుబ్రమణ్యం, మెడికల్ కళాశాల ఎన్ఎంసి టీం డాక్టర్ వైఎంఎస్.ప్రసాద్, డాక్టర్ ప్రవీణ్ దీన్ కుమార్, డాక్టర్ పద్మ శ్రావణి, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ బసిరెడ్డి ప్రవీణ తదితరులు ఎంఎంసీ వైద్య బృందానికి దగ్గరుండి వివిధ విభాగాలను పరిచయం చేశారు.



వైద్యకళాశాల సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎన్ఎంసి బృందం

గాంధీజీకి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు చెల్లించాలి

సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్నగౌడ్

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్‌లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని పెన్షనర్‌ల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప డిమాండ్ చేశారు. సోమవారం పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు మహాత్మా గాంధీ 75 వర్థంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్స్‌కు గత 2018 సంవత్సరం నుంచి రావాల్సిన డిఆర్ బకాయిలు, 11వ పిఆర్‌సి బకాయిలు ఇంత వరకు ప్రభుత్వం విడుదల చేయక పోవడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగులకు, పెన్షనర్స్‌కు చట్టప్రకారం, న్యాయపరమైన రావాల్సిన ఎన్నో ఆర్థిక ప్రయోజనాల పట్ల నిర్లక్ష్యం వహించడం బాధాకరం అన్నారు. ఈ నేపథ్యంలో పెన్షనర్స్ అందరూ సంఘం బలోపేతానికి తమ వంతు కషి చేయాలని కోరారు. పెన్షనర్ల న్యాయపరమైన డిమాండ్స్‌పై ప్రభుత్వంతో నేరుగా చర్చించడానికి వేదికైన రాష్ట్ర జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నందు సభ్యత్వం పొంది మన సమస్యల పరిష్కారం కోసం కషి చేయాలన్నారు. అందుకు అవసరమైన ప్రతీ జిల్లా, తాలూకా, మండల స్థాయిలో ఉన్న పెన్షనర్లను సభ్యులుగా చేర్పించి సంఘం బలోపేతానికి పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంఘానికి రు.25,000 వేలు విరాళం అందించిన కె. ఆదిలక్ష్మి, రిటైర్డ్ టీచర్, జిల్లా సంఘం ఈసీ మెంబెర్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్‌ల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు రామకష్ణ, డేనియల్ ప్రభాకర్, రమేష్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంత బాలోత్సవం వాలంటరీలకు ప్రశంసలు

అభినందించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి

వాలంటీర్లను అభినందిస్తున్న ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి

అనంతపురం కలెక్టరేట్ : అనంత బాలోత్సవం కమిటీ ఆధ్వర్యం లో ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈనెల 27, 28, 29, తేదీల్లో నిర్వహించిన బాలోత్సవంలో వాలంటీర్లు సేవలు అందించి వజయవంతం చేసిన విద్యార్థులు వాలీంటర్లకు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి అభినందించారు. సోమవారం ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ ఛాంబర్‌లో బాలోత్సవం వాలంటీర్‌లకు ప్రశంస పత్రాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులలో ప్రతిభను వెలికి తీయడం కోసం, చదువుల కోసం ర్యాంకుల కోసం పరిగెత్తే ఈ ప్రపంచంలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని చాటి చెపుతూ విద్యార్థుల ప్రతిభను బయటకు తీయడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు, పాఠశాల యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వాలంటీర్లుగా పని చేసిన ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, కళాశాల విద్యార్థులు భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించగలరనె ధీమా వచ్చిందన్నారు. కళాశాల విద్యార్థులు ఇలాంటి కార్యక్రమంలో పాల్గొని అనేక అనుభవాలు నేర్చుకొని భవిష్యత్తు జీవనానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షులు సిద్ధార్థ, తరిమెల గిరి, విజయ్, కిరణ్, వాలంటరీస్ గౌసియా, రజిత, శిరీష, వాణి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం

రాయదుర్గం రూరల్ : కణేకల్ మండల పరిధిలోని గెనిగేర గ్రామంలో వాల్మీకి మహర్షి నూతన విగ్రహ ప్రతిష్టానకు నియోజకవర్గ వాల్మీకి సంక్షేమ సేవా అధ్యక్షులు బండి కిష్టప్ప రూ.10100 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, ఈశ్వర్, రమణ, సూర్యనారాయణ, నరహరి, శివమూర్తి, గోవింద, గురుమల్ శీన, రాయుడు, వన్నూరుస్వామి, హరికృష్ణ, యల్లప్ప, సురేష్, రామాంజి, రాజు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందించిన దాతను సన్మానిస్తున్న వాల్మీకి నాయకులు

ప్రజాశక్తి www.prajasakti.com

పుస్తకాలు విద్యార్థుల నేస్తాలు

బుక్కరాయసముద్రం : పుస్తకాలు విద్యార్థుల భవితకు నేస్తాలు అని, పంచాయతీరాజ్ ఈఈ మల్లికార్జునమూర్తి తెలిపారు. సోమవారం ఎస్‌కెసి సేవాసమితి ఆధ్వర్యంలో భాగ్యనగర్ కాలనీ ఎమ్మెల్సీ స్కూల్ లైబ్రరీకి ర్యాక్‌ను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఈఈ మల్లికార్జునమూర్తి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. వారికి తగిన వసతులు, సౌకర్యాలు కల్పిస్తే బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధిస్తారని తెలిపారు. చదువుకునే వయస్సులో విద్యతో పాటు నైతిక విలువలు తెలియజేయాలని సూచించారు. ఎస్‌కెసి సేవాసమితి వారు లైబ్రరీని ఏర్పాటుచేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెసి సేవాసమితి వ్యవస్థాపకులు కమలనాథ్, ఉపాధ్యక్షులు జి.వి.రమణ, సివిల్ ఇంజనీర్ అల్తాఫ్ ఖాన్, హెడ్ మాస్టర్ బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఇవ్వాలని వినతి

నార్పల : వికలాంగులకు రేషన్ బియ్యం ఇవ్వాలని నార్పల మండల కేంద్రంలోని వికలాంగుల కాలనీకి చెందిన దివ్యాంగులు సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు సురేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, సిఐటియు మండల కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ.. స్థానిక వికలాంగుల కాలనీలో సుమారు 25 దివ్యాంగుల కుటుంబాలు నివాసముంటున్నాయని తెలిపారు. వికలాంగులు రేషన్ సరుకులు, పింఛను తీసుకోడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి వికలాంగులకు కాలనీలోనే రేషన్ సరుకులు, పింఛన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు నాగలక్ష్మి, సరస్వతి, గౌరి, జయమ్మ, పుల్లన్న, రవి, నరసింహులు, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

ఆత్మకూరు : మండలంలోని పి.యాలేరు గ్రామానికి చెందిన రైతు పార్వతమ్మ సర్వే నెంబర్ 242-2 శెనగపంట పొలంలో ఎఇఒ సుజిత పర్యవేక్షణలో పంటకోత ప్రయోగం చేశారు. నిర్దేశిత ప్రాంతంలో రెండు కేజీల 800 గ్రాములు దిగుబడి వచ్చింది. దీని ప్రకారం ఎకరాకు 448 కేజీలు దిగుబడి నమోదు అయింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నీలిమరెడ్డి పాల్గొన్నారు.

వాహనాల వేలంపాట

పుట్లూరు : ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ 8 ద్విచక్రవాహనాలకు పుట్లూరు పోలీస్‌స్టేషన్ ఆవరణంలో సిఐ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వేలం పాట నిర్వహించారు. ఇందులో ఒక మోటారు సైకిల్‌కు ఎవ్వరూ వేలం పాట పాడలేదు. ఈ వాహనానికి మరోసారి వేలం పాట నిర్వహిస్తామని సిఐ తెలిపారు.

జగనన్న లేఅవుట్ పరిశీలన

పెద్దపప్పూరు : పెద్దపప్పూరు మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌ను సిపిఐ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులకు ఇస్తున్న రూ.1.80 లక్షలు పునాదులు వేసేందుకు కూడా సరిపోవడం లేదన్నారు. రూ.5 లక్షలు మంజూరు చేయాలని, గత ప్రభుత్వం ధర్మాపురం రోడ్డులో లబ్ధిదారులకు పంపిణీ చేసిన రెండున్నర సెంట్లు స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తహశీల్దారు కార్యాలయం ఎదట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కంబగిరిస్వామి, వేణుగోపాల్, సిపిఐ షఫీ, రామకృష్ణ పాల్గొన్నారు.

పలువురు వైసిపిలో చేరిక

శింగనమల : శింగనమల మండలం సిబండమీదపల్లి గ్రామంలోని టిడిపికి చెందిన 12 కుటుంబాల వారు డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామ్‌రెడ్డి, చక్రాయిపేట వైసిపి నాయకులు నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, లోకనాథ్ ఆధ్వర్యంలో సోమవారం వైసిపిలో చేరారు. టిడిపికి చెందిన మంజుల, వడ్డే నెట్టికంటి, నీరుగంటి శ్రీనివాసులు, బుల్లె నాగరాజు, శేఖర్, వీరాంజనేయులు, గోగుల రామాంజనేయులు, చిన్న వెంకటేష్, చౌడప్ప, డేరంగుల రామాంజనేయులు, మంజుల శేఖర, సంజీవ, వీరాంజనేయులు తదితరులకు బొమ్మన శ్రీరామిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శెట్టిపల్లి నరసింహారెడ్డి, సన్న మల్లయ్య, జయరాముడు, ఆదెప్ప, వెంకటరమణ పాల్గొన్నారు.

దిశా యాప్‌పై అవగాహన

నార్పల : స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో దిశా యాప్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా అపరిచితులు, ఆకతాయిలు తమను వేధిస్తున్నా, అసౌకర్యానికి గురి చేస్తున్న దిశా యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. అపరిచిత వ్యక్తులు సన్నిహితంగా మాట్లాడుతూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐలు ఈశ్వరయ్య, నాగరాజు, సిబ్బంది చలపతి, నందగోపాల్, దివాకర్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిని సందర్శించిన కేంద్ర బృందం

ఆత్మకూరు : ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని న్యూ ఢిల్లీకి చెందిన డాక్టర్ ప్రియా సెంథిల్ కుమార్ బృంధం సోమవారం సందర్శించింది. ఒపి విభాగం, కాన్పుల వార్డు, ఫార్మసీ విభాగాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, అసంక్రమిత వ్యాధులు, కుష్టు, మలేరియా, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుమన గోపిచంద్, డాక్టర్ సునీల్, డాక్టర్ సబీహా సుల్తానా, సిహెచ్ఒ చంద్రావతి, హెడ్ నర్సు పద్మావతి, ఎంపిహెచ్ఇఒలు పాల్గొన్నారు.

మార్చికి టవర్‌క్లాక్ ఆర్ఓబిపై రాకపోకలు

బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అనంత

బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి) పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. మార్చి నాటికి రెండు వైపులా బ్రిడ్జి పనులు పూర్తి చేసి వాహన రాకపోకలకు అనుమతి ఇచ్చేలా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఆర్ఓబితో పాటు వెహికల్ అండర్ పాస్ పనులను అధికారులు, ఎస్ఆర్‌సి ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ముందుగా బ్రిడ్జి కింది భాగంలో జరుగుతున్న పనులను చూశారు. వెహికల్ అండర్ పాస్ నిర్మాణం తర్వాత రాకపోకలు ఎలా ఉంటాయో పరిశీలించారు. ఇప్పటికే బ్రిడ్జికి ఒకవైపు సర్వీస్ రోడ్డు పనులు జరిగాయని, మరోవైపు (శాంతి థియేటర్ వైపు) కూడా పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ఎస్ఆర్‌సి ప్రతినిధి అవినాష్‌కు సూచించారు. భూసేకరణ, పరిహారంకు సంబంధించి ఎంత వరకు వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. స్థానికులు, దుకాణాల యజమానులతో మాట్లాడారు. మీరు ఎంత త్వరగా సహకరిస్తారో అంతే త్వరగా పనులు పూర్తవుతాయని సూచించారు. ప్రతి ఒక్కరికీ పరిహారం అందుతుందని భరోసా ఇచ్చారు. ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే దుకాణదారులకు కూడా మేలు జరుగుతుందని తెలియజేశారు. అందులో భాగంగా దుకాణాల ముందు పార్కింగ్‌కు స్థలం వదులుకోవాలని సూచించారు. ఆ తర్వాత బ్రిడ్జిపైకి వెళ్లి పనులు పరిశీలించారు. టేప్‌తో బ్రిడ్జి కొలతలు తీయించారు. గడ్డర్ల లాంచింగ్‌కు అనుమతులు, పనులు ఎప్పుడు ప్రారంభిస్తారన్న వివరాలపై ఆరా తీశారు. రెండు బ్రిడ్జిలకు మధ్యలో గ్రీనరీ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరగా బ్రిడ్జితో పాటు రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ముందుగా అనుకున్న ప్రకారం ఈ ఏడాది మార్చి ఆఖరికి బ్రిడ్జిని ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. వారం అటో, ఇటో బ్రిడ్జి పనులు అయిపోతాయని అధికారులు, కాంట్రాక్టర్ చెబుతున్నారన్నారు. నిత్యం పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు, కాంట్రాక్ట్ ప్రతినిధులను అభినందించారు. ఎమ్మెల్యే అనంత వెంట 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

దళితులను ఇబ్బంది పెట్టడం సరికాదు

ప్రజాశక్తి-గార్లదిన్నె

కోటంక గ్రామంలో సర్వే నెంబర్ 243-1లో దళితులు చదును చేసుకుంటున్న భూమికి ప్రభుత్వం నోటీసులు ఇచ్చి లాక్కునే ప్రయత్నం చేస్తోందని, దళితులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీకి చెందిన 30 మంది అదే సర్వే నెంబరు భూమిని ఆక్రమించుకున్నా పట్టించుకోని అధికారులు దళితులకు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. ప్రభుత్వ అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి దళితులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దళితులు చదును చేసుకుంటున్న భూమికి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సిపిఎం నాయకులు, దళిత రైతులు పాల్గొన్నారు.

నీటిగుంటను పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

చిన్నపప్పూరు సమీపంలోని అశ్వర్థనారాయణస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చి పెన్నానదిలో నీటి గుంటలో పడి ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన విషయం విధితమే. ఆ నీటి గుంటను తహశీల్దారు షర్మిల సోమవారం పరిశీలించారు. అక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆలయ ఈవో సుబ్రమణ్యం, ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డికి సూచించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకనే విమర్శలు

నగర మేయర్ మహమ్మద్ వసీం

అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

వైసిపి ముడున్నరేళ్ల పాలనలో నగరంలో రూ.97 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టుల అభివృద్ధి చేపట్టినట్లు నగర మేయర్ మొహమ్మద్ వసీం పేర్కొన్నారు. నగరంలోని 38వ డివిజన్ పరిధిలో రూ.32 లక్షల వ్యయంతో చేపడుతున్న వివిధ పనులను మేయర్ మహమ్మద్ వసీం కమిషనర్ భాగ్యలక్ష్మి తో కలసి సోమవారం ప్రారంభించారు. త్వరితగతిన నాణ్యతతో పనులు పూర్తి చేయించాలని అధికారులకు వారు సూచించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ నగర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సహకారంతో అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కృషితో నగరంలో .సిమెంట్ రోడ్ల ఏర్పాటుతోపాటు డ్రైనేజీలను కూడా ఏర్పాటుచేసి పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టామన్నారు. వీటితోపాటు రూ.25 కోట్ల స్పెషల్ గ్రాంట్ నగర అభివృద్ధి కోసం తీసుకొచ్చామన్నారు. నగరంలో ప్రధాన రహదారుల అభివృద్ధితోపాటు అన్ని డివిజన్ల పరిధిలోని అంతర్గత రహదారుల అభివృద్ధికి అత్యధికంగా నిధులను కేటాయిస్తున్నామన్నారు. గత 30 ఏళ్లలో జరగని అభివృద్ధి నేడు నగరంలోని అన్ని డివిజన్లలో కనిపిస్తోందన్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి నగరంలో రోడ్లన్నీ గుంతలుగా ఉన్నాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలు ప్రభాకర్ చౌదరిని నమ్మి 2014 ఎన్నికల్లో గెలిపిస్తే ఐదేళ్లలో డివైడర్లు, పార్కులు తప్ప చేసిందేమీ లేదన్నారు. దీనిని గుర్తించిన ప్రజలు 2019 ఎన్నికల్లో ఆయన్ను ఓడించారని గుర్తుచేశారు. నగర అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రభాకర్ చౌదరి చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, డీఈ రాంప్రసాద్ రెడ్డి, ఏఈ శంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌పిఒ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రవ్యాప్తంగా తొలగించిన ఎస్‌పిఒలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్‌కుమార్, సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. రాయదుర్గంలోని ఎపి ఎన్జీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌పిఒ ఉద్యోగులను తొలగించడం వల్ల చెక్‌పోస్ట్ వద్ద భద్రత లేక రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోకి కర్ణాటక మద్యం, మాదకద్రవ్యాలు, గుట్కా ప్యాకెట్లు విచ్చలవిడిగా వస్తున్నాయన్నారు. వీటిని నిలువరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. వెంటనే ఎస్‌పిఒల పోస్టులను భర్తీ చేసి అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తిలక్‌యాదవ్, రాయదుర్గం తాలూకా అధ్యక్షులు కుమార్, కార్యదర్శి కోట్రేష్, రాయదుర్గం మండల కార్యదర్శి అనిల్‌కుమార్, వీరేష్, యోగేంద్ర, వివేక్, తదితరులు పాల్గొన్నారు.

అనంత బాలోత్సవంలో బికెఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాళాశాల క్రీడా మైదానంలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు జరిగిన అనంత బాలోత్సవం పోటీలలో బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి మూడు బహుమతులను కైవసం చేసుకున్నారు. సోమవారం ఉదయం పాఠశాలలో ప్రార్థనా సమయంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుమంగళి మాట్లాడుతూ.. బాలోత్సవంలో నిర్వహించిన జానపద నృత్య పోటీల విభాగంలో కీర్తి, అక్షయ గ్రూప్ ద్వితీయ బహుమతి, జానపద పాటల పోటీలలో 9వ తరగతి విద్యార్థి నవీన్ ద్వితీయ బహుమతి, వ్యాసరచన పోటీలో ఎనిమిదో తరగతి విద్యార్థిని సంధ్య ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ బాలచంద్రుడు, ఉపాధ్యాయులు నీలకంఠారెడ్డి, దివాకర్‌రెడ్డి, రవీంద్ర, గోపాల్ రెడ్డి, లలితమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై గ్రీవెన్స్‌లో కార్మికుల వినతి

అనంతపురం : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఎఫ్‌ఆర్ఎస్ విధానం నుంచి కార్మికులకు మినహాయింపు ఇవ్వాలని సిఐటియు ఓల్డ్ టౌన్ నగర ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు ఆధ్వర్యంలో నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు బకాయి వేతనాలు, హెల్త్ అలవెన్స్ లు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, సకాలంలో యూనిఫామ్, పనిముట్లు, రక్షణ పరికరాలు, ఇవ్వాలని, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉపాధి కల్పించాలని, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకూ ఈపీఎఫ్, ఈఎస్ఐ డెత్ బెనిఫిట్స్ ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తి, కుల్లాయప్ప, లక్ష్మన్న, నారాయణస్వామి, నాగేంద్ర, శివ, మల్లేష్, రామాంజి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి : సిపిఎం

గార్లదిన్నె : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు,ఉన్నతాధికారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని అక్రమాలకు పాల్పడుతున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. తహశీల్దార్ ఉషారాణికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి మాట్లాడుతూ..డీఎస్పీ స్థాయి అధికారి కమలాపురం గ్రామ రెవెన్యూలో 50 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నా ఎలాంటి చర్యలూ చేపట్టలేదన్నారు. కల్లూరు అగ్రహారం గ్రామంలో సర్వే నెంబర్ 164లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు మేల్కొని ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో మాజీ కోఆప్షన్ మెంబర్ మృతి

నార్పల : నార్పల మండల కేంద్రానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మాజీ కో ఆప్షన్ మెంబర్ దర్జీ టోపీ సాహెబ్ (72) అనారోగ్యంతో మరణించారు. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు, టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆకుల విజయకుమార్ తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఇళ్ల బిల్లులు మంజూరు చేయాలని నిరసన

బుక్కరాయసముద్రం : బుక్కరాయసముద్రం జన చైతన్య నగర్ కాలనీలోని పేదల ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు మంజూరు చేయాలని టిడిపి మైనార్టీ అధికార ప్రతినిధి తూముచెర్ల బాబా ఫకృద్దీన్ వలి ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ..నిర్మాణం చేపట్టిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు వినతి చేశామన్నారు. అధికారుల నిర్లక్ష్యం చేస్తుండడతో నిరసన తెలిపామని చెప్పారు. నాలుగేళ్లుగా ఇంటి బిల్లులు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. టిడిపి సానుభూతి పరులమన్న కారణంతో బిల్లులు మంజూరు చేయకపోవడం సరికాదన్నారు. వెంటనే బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు మోహన్‌కుమార్, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దారు దీనిపై రెండురోజుల్లో విచారణ జరిపి పై అధికారులకు నివేదిక ఇవ్వాలని హౌసింగ్ ఏఈని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ జిల్లా కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి రంగమ్మ, టీడీపీ మైనార్టీ నాయకులు హట్టు ఖాదర్‌వలి, చాపల మాబున్ని, మండల మైనార్టీ అధ్యక్షుడు టోపి బాషా, ఉపాధ్యక్షుడు సిలార్ బాషా, దూదేకుల మహబూబ్ బాషా, సలీమా, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

'అండర్-19' విజయంపై సంబరాలు

కేక్ కట్‌చేసి అభినందనలు తెలిపిన ఆర్డీటీ క్రీడాకారులు

తాడిపత్రి : ఐసిసి ప్రారంభించిన మొట్టమొదటి అండర్-19 టీ-20 క్రికెట్ మహిళా వరల్డ్ కప్ ఫైనల్లో భారత మహిళా జట్టు ఇంగ్లాడ్ జట్టును ఓడించి కప్పును కైవసం చేసుకుని చరిత్రను సృష్టించడంతో తాడిపత్రి ఆర్డీటీ సబ్ సెంటర్ కోచ్ భార్గవ్ క్రీడాకారుల చేత సోమవారం కేక్ కట్‌చేసి భారత మహిళా జట్టుకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోచ్ భార్గవ్ మాట్లాడుతూ.. ఈ విజయంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులు ప్రాతినిత్యం వహించడం గర్వకారణం అన్నారు. క్రికెట్‌లో మహిళలను ప్రోత్సహించడానికి బిసిసిఐ ఎంతో కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా వచ్చేనెల నుండి ఐపిఎల్ తరహా మ్యాచ్‌లను నిర్వహిస్తోందన్నారు. ప్రతి ప్లేయర్‌ను రూ.కోట్లు వెచ్చించి యాజమాన్యాలు కొనుగోలు చేస్తున్నాయన్నారు. మహిళలకు క్రికెట్‌లో ఉజ్వల భవిష్యత్ ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాడిపత్రి నుంచి జాతీయ జట్టుకు ఆడేలా కష్టపడాలని క్రీడాకారులకు సూచించారు. ఆడపిల్లలు క్రీడారంగంలో రాణించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. ఆర్డీటీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన అండర్-12 మిక్స్ జెండర్ టోర్నీలో తాడిపత్రికి చెందిన 7 సంవత్సరాల రాంజ్యోతి, ఆఫ్రిన్ తాజ్, నిధి లు మూడు మ్యాచ్‌లూ గెలవడంలో తమవంతు ప్రతిభ చూపారని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు వినయ్, మహేంద్ర, మనోజ్, ఆర్డీటీ క్రీడాకారులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

పెద్దపప్పూరు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు పెద్దపప్పూరులోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ అశ్వర్థ నారాయణస్వామి భవాని భీమిలింగేశ్వర స్వామి వార్లకు హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ అధికారులు సోమవారం లెక్కించారు. తాత్కాలిక హుండీ ద్వారా రూ.3,92,008, శాశ్వత హుండీ ద్వారా రూ.5,89,344 మొత్తం రూ.9,81,352 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం, ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు

ఉరవకొండ : కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేద్దామని రాకెట్ల పిహెచ్‌సి వైద్యాధికారి పావని పిలుపునిచ్చారు. సోమవారం రాకెట్ల గ్రామంలో కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జనవరి 30వ తేదీ నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో కుష్టు వ్యాధిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉండి దానిపై చెమటలు పట్టకపోవడం వెంట్రుకలు లేకపోవడం లాంటి లక్షణాలు ఉంటే దానిని కుష్టు వ్యాధిగా భావించాలని సూచించారు. శరీరంపై మచ్చలు ఏర్పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఆలస్యం చేస్తే అంగవైకల్యం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అనంతరం కలెక్టర్ సందేశాన్ని ప్రజలకు వినిపించారు. గ్రామంలో కుష్టు వ్యాధి అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. సిహెచ్ఒ నాగ రంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, సూపర్‌వైజర్, శ్రీధర్‌మూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలను సాధించడమే కర్తవ్యం

ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహాత్మాగాంధీ కలలు సాకారం చేసుకుని ఆయన ఆశయాలను సాధించడమే కర్తవ్యంగా మనమందరం కృషి చేయాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అన్నారు. సోమవారం జాతిపిత గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీసాయి కళాశాల విద్యార్థులతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల నుంచి టవర్‌క్లాక్ గాంధీ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ గాంధీ కళలు కన్న సమాజం ఇంకా నెరవేరలేదన్నారు. బ్రిటీష్ వారి నుంచి స్వాతంత్ర్యం సాధించిన గాంధీ దేశంలో ఆడది అర్ధరాత్రి రోడ్డులో స్వేచ్ఛగా తిరిగి క్షేమంగా ఇంటికి చేరినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లవుతుందని చాటి చెప్పారని తెలిపారు. అయితే నేడు ఇంట్లో ఉన్న మహిళలకు, ఆడపిల్లలు, పసి పిల్లలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రోజు రోజుకూ దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు మహిళకు రక్షణ కల్పించడంలో విఫలం చెందాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. గాంధీ ఆశయాలకు అనుగుణంగా మనమందరం స్వేచ్ఛ, సమానత్వం, స్వతంత్రంగా జీవించేలా సమాజాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు. అందుకు ప్రభుత్వాలతో పాటు ప్రజలుగా మనమందరం తమవంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ గాంధీ చూపిన శాంతి మార్గమే అందరికీ సన్మార్గం అన్నారు. విద్యార్థులు శాంతి మార్గం, అహింసా మార్గాన్ని ఎంచుకుని సమాజానికి తోడ్పాటు అందించాలన్నారు. దేశం పట్ల గౌరవంతో మెలగాలని అప్పుడే గాంధీ వంటి మహనీయులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివ, ఉపాధ్యక్షుడు సిద్ధార్థ, తరిమెల గిరి, నాయకులు విజయ్, కిరణ్, గౌసియా, రజిత, శీరీష తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : భారతదేశంపై చెరగని ముద్రవేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీ అని నగర మేయర్ మొహమ్మద్ వసీం కొనియాడారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో సోమవారం గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

గాంధీకి నివాలి అర్పిస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

రాయదుర్గం : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయంతి, సురేష్‌కుమార్, విగ్రహ దాత సుబ్రమణ్యం, సుదర్శన్, ఉమామహేశ్వరయ్య, వెంకట రమేష్, శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొలికొండ రంగనాథుని ఉత్సవాలు

ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాలు

రంగనాథస్వామి ఆలయం. ఇన్‌సెట్‌లో ఉత్సవమూర్తులు

ప్రజాశక్తి-గుత్తి

శ్రీ బొలికొండ రంగనాథస్వామి తిరునాల అంగరంగ వైభవంగా జరగనుంది. మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన శ్రీ బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు, వసతులు ఏర్పాటు చేశారు. రంగనాథస్వామి భక్తులు రాయలసీమ జిల్లాల్లో అధికంగా ఉన్నారు. రంగనాథస్వామి పుట్టుశిల తొండపాడు గ్రామ సమీపంలో ఎత్తైన కొండపైన ఉంది. దాన్ని శ్వేతగిరి అని పిలుస్తారు. ఆలయానికి ఏడాదికి రూ.10 లక్షలు పైగానే ఆదాయం సమకూరుతోంది. దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ కేవీ.సాగర్‌బాబు, డిప్యూటీ కమిషనర్ ఎస్.రాణాప్రతాప్, సహాయ కమిషనర్ ఎం..రామాంజనేయులు, ఇన్‌స్పెక్టర్ కె.రామతులసి, ఆలయ కార్యనిర్వహణాధికారి వి.దేవదాసు పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాల వేడుకలు జరుగుతాయి. మాఘమాసాన్ని పురస్కరించుకొని జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 30వ తేదీన ధ్వజారోహణ, అంకురార్పణ, 31వ తేది సింహ వాహనోత్సవం, ఫిబ్రవరి నెల 1వ తేదీ శేషవాహనం, 2వ తేదీ హనుమద్ వాహనం, 3వ తేదీ గరుడవాహనం, 4వ తేదీ గజవాహనం, కల్యాణోత్సవం, 5వ తేదీ రథోత్సవం, 6వ తేదీ పారువేట, అశ్వవాహనం, 7వ తేదీ వసంతోత్సవం, హంసవాహనంతో ఉత్సవాలు ముగుస్తాయి. అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఉత్సవాలకు రానున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.దేవదాసు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ పడకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. తిరునాళ్లకు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారికి మొక్కులు తీర్చుకోవాలి కోరారు.

ప్రజల్లోకి రావాలంటే ధైర్యం ఉండాలి

ఎపిఎస్ ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత ప్రజల్లోకి వెళ్లాలంటే ఏ అధికా పార్టీ నాయకులకైనా ప్రజలకు సేవ చేశామనే ధైర్యం ఉండాలని, అలాంటి ధైర్యాన్ని సిఎం జగన్మోహన్‌రెడ్డి వైసిపి శ్రేణులకు ఇచ్చారని ఎపిఎస్ ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఉరవకొండ మండల పరిధిలోని షేక్షానుపల్లి గ్రామంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వేశ్వరరెడ్డితో కలిసి ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, జోనల్ ఛైర్మన్ మంజుల, పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పెన్నోబులేసు పాల్గొన్నారు. వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ అధికారంలో ఉన్న ఏ రాజకీయ పార్టీ అయినా మూడేళ్ల తర్వాత ప్రజల్లోకి వెళ్లాలంటే ధమ్ము, ధైర్యం ఉండాలన్నారు. ఎందుకంటే ఈ మూడున్నరేళ్లలో ప్రజలు ఏం చేశారని అడిగితే మీకు పలానా చేశాం అని చెప్పేందుకు ధైర్యం కావాలన్నారు. అలాంటి ధైర్యాన్ని సిఎం జగన్ కల్పించారని చెప్పారు. టిడిపి ప్రభుత్వం గ్రామాన్ని దోచుకునేందుకు జన్మభూమి కమిటీలు పెడితే.. జగన్మోహన్ రెడ్డి గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేస్తూ వాలంటీర్, సచివాలయ వ్యవస్థలతో స్థానిక పరిపాలనలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చారన్నారు. మంచి పరిపాలన అందిస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సిపి వీరన్న, ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, విడపనకల్లు జెడ్పిటిసి హనుమంతు, సర్పంచి లింగన్న, ఎంపిటిసి రామలింగ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, పిఎసిఎస్ ఛైర్మన్ తేజోనాథ్, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ సుంకన్న, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

పిపిల నియామకంలో బిసిలకు న్యాయం చేయాలి

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకంలో బిసిలకు న్యాయం చేయాలని భారతీయ పంచాయత్ పార్టీ న్యూఢిల్లీ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.మల్లేష్‌యాదవ్ కోరారు. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. జిల్లా కోర్ట్ 1920లో ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు అగ్రవర్ణాల వారినే పిపిలుగా ప్రభుత్వాలు నియమించాయని తెలిపారు. 1981లో మాత్రమే బిసి సామాజిక వర్గానికి చెందిన కె.సిద్ధయ్య అడ్వకేట్‌ను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించిందన్నారు. ఆ తరువాత ఆ స్థానంలో బిసిలను అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎవరిని నియమించలేదన్నారు. కాంగ్రెస్‌లో రెడ్లు, టిడిపి అధికారంలో ఉంటే కమ్మ సామాజిక వర్గాలకు చెందిన వారికే పిపిలుగా పోస్టులు కేటాయిస్తున్నారని తెలిపారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో మొదటి నోటిఫికేషన్‌లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికే పిపిగా నియమించారన్నారు. మరల ఇప్పుడు నోటిఫికేషన్ విడుదల చేశారని, ఇప్పటికైనా ఇస్తున్న నోటిఫికేషన్‌లోనైనా బిసిలకు పిపిగా నియమించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

ఆయాల తొలగింపును విరమించుకోవాలి

గుంతకల్లు : పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల తొలగింపు ఆలోచనను విరమించుకోవాలని సిఐటియు పట్టణ అధ్యక్షుడు కసాపురం రమేష్ డిమాండ్ చేశాడు. ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న ఆయాలు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో గత 20 సంవత్సరాలుగా అతి తక్కువ జీతాలతో ఆయాలు పని చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో హెడ్‌మాస్టర్లు ఆయాలను ఉద్యోగం నుండి తొలగిస్తామని, నోటీసులు ఇస్తామని బెదిరిస్తున్నారని అన్నారు. ఆయాల తొలగింపు ఆలోచనను విరమించుకొని వారికి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు బి.తిమ్మప్ప, నాయకులు రాము నాయక్ పాల్గొన్నారు.